పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

నినదిస్తున్న టీఆర్ఎటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణప్రసాద్ గౌడ్, సభ్యులు

గంభీరావుపేట, డిసెంబర్ 15: ఉపాధ్యాయ ఉద్యోగుల సామాజిక భద్రతకు పాత పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం పునరుద్ధరించాలని టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ ప్రసాద్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన టీఆర్టీఎఫ్ మండల సమావేశానికి హాజరై మాట్లాడారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం సీపీఎస్‌ను రద్దుచేసి రాష్ట్రంలోని రెండు లక్షల మంది ఉద్యోగ ఉపాధ్యాయులకు ఉపశమనం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో 57ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇక్కడ టీఆర్టీఎఫ్ మండలాధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి బాలకిషన్, జిల్లా కౌన్సిలర్లు గంధ్యాడపు శ్రీనివాస్, రామచంద్రం,భాస్కర్ తదితరులున్నారు.

ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ పరిశీలన

ఓపెన్ స్కూల్ సొసైటీ స్టడీ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న రాష్ట్ర కోఆర్డినేటర్ విజయకృష్ణ

వేములవాడ రూరల్, డిసెంబర్ 15 : వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌లో తెలంగాణ ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌ను రాష్ట్ర కోఆర్డినేటర్ విజయకృష్ణ, జిల్లా కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ, పదో తరగతి ఓపెన్‌స్కూల్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులకు సలహాలు అందించారు. తప్పకుండా విద్యార్థులు ఓపెన్ స్కూల్‌కు హాజరుకావాలని సూచించారు. ఇక్కడ ఉపాధ్యాయుడు కృష్ణచైతన్య, నరేందర్, పద్మ, విద్యార్థులున్నారు.

ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలి

చందుర్తి,డిసెంబర్15: మోహిని కుంట మల్లికార్జున స్వామి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం చందుర్తి మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో మోహిని కుంట మల్లికార్జున స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఇక్కడ ఆలయ కమిటీ చైర్మన్ నక్క గంగాధర్, ఏఎంసీ చైర్మన్ చెలుకల తిరుపతి, నాయకులు చింతపంంటి రామస్వామి, కాసారం మల్లారెడ్డి,బైరగోని రమేశ్, మరాటి మల్లిక్ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులున్నారు.

జనవరి 18 నుంచి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

వేములవాడ టౌన్, డిసెంబర్ 15: జనవరి 18 నుంచి 22వ తేదీ వరకు రాజన్న ఆలయంలో త్యాగరాజస్వామివారి ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ అధికారులు వెల్లడించారు. ఆరాధనోత్సవాల్లో పాల్గొనే కళాకారులు దరఖాస్తులను డిసెంబర్ 25వ తేదీ వరకు స్వీకరిస్తారని, దేవస్థానం నిర్ణయించిన రోజున, కేటాయించిన సమయంలో మాత్రమే కార్యక్రమం నిర్వహిస్తామని అధికారులు వెల్లడించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★Kota Danalaxmi D/o. Sattaiah (before marriage) My Name was changded to DASARI VIJAYA W/o. DASARI VENUGOPAL (after marriage) H.No.11-5-51, Sundaraiahnagar, Sircilla Town & Mandal, Rajanna Sircilla Dist.
NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

తేనెటీగల దాడిలో పలువురికి గాయాలు

చందుర్తి, డిసెంబర్15: చందుర్తి మండలం మర్రిగడ్డలో మల్లికార్జున స్వామి ఆలయంలో మొక్కులు చెల్లించేందుకు వచ్చిన భక్తులపై ఆదివారం తేనెటీగలు దాడి చేయడంతో దాదాపు పదిమందికి పైగా గాయపడి దవాఖానలో చేరారు. మర్రిగడ్డ శివారులోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో బోనం మొక్కు చెల్లించేందుకు ఆలయ పరిసరాల్లోని గిరక తాడిచెట్ల వద్ద బోనం వండేందుకు పొయ్యి పెట్టి మంట పెట్టడంతో పొగతో గిరిక తాడి చెట్లపై ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా లేచి అక్కడ ఉన్న భక్తులపై దాడి చేశాయి. మర్రిగడ్డ గ్రామానికి చెందిన మల్యాల అంజయ్య, బైరగోని ఎల్లయ్య, మల్యాల రాజవ్వ, కత్తి లస్మవ్వ, మల్యాల లక్ష్మి, స్రవంతితోపాటు మరో ఐదుగురిపై దాడి చేశాయి. వీరిని చికిత్స నిమిత్తం వేములవాడలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు.

తాటిచెట్టు పైనుంచి జారిపడి గీత కార్మికుడికి గాయాలు

బోయినపల్లి, డిసెంబర్ 15: బోయినపల్లి మండలం కోరెం గ్రామానికి చెందిన గీత కార్మికుడు పర్కాల నర్సయ్య ఆదివారం ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి జారిపడగా తీవ్రగాయాలయ్యాయి. గీత కార్మికుల కథనం ప్రకారం.. కోరెంకు చెందిన గీత కార్మికుడు పర్కాల నర్సయ్య రోజువారీ లాగానే కళ్లు గీయడానికి తాటి చెట్టు ఎక్కాడు. తాటిచెట్టు ఎక్కుతుండగా మధ్యలో నుంచి ప్రమాదవశాత్తూ జారి కింద పడిపోతుండగా అక్కడే ఉన్న తోటి కార్మికులు వెంటనే వచ్చి కిందకు దించారు. అనంతరం బోయినపల్లికి వైద్యుని వద్దకు తీసుకెళ్లి వైద్యం చేయించారు.

'వరదవెల్లి అభివృద్ధికి ప్రత్యేక కృషి'

బోయినపల్లి, డిసెంబర్ 15: బోయినపల్లి మండలం వరదవెల్లి శ్రీ దత్తాత్రేయ ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆదివారం వరదవెల్లి శ్రీ దత్తాత్రేయ స్వామి 44వ జయంతికి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంలు దత్తాత్రేయ ఆలయానికి బోటులో వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి మాట్లాడుతూ, ఉత్సవాలకు ఏటా ఏర్పాట్లు చేస్తామని, ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ రెడ్డి, ఎంపీడీవో జయశీల, కాంగ్రెస్ నాయకులున్నారు.

వాల్టా చట్టానికి తూట్లు

- యథేచ్ఛగా చెట్లు నరికివేస్తున్న అక్రమార్కులు
- చర్యలు తీసుకోవాలంటున్న వన ప్రేమికులు

మామిడిపల్లిలో కొమ్మలు నరికివేయగా మోడువారిన మర్రిచెట్టు, (ఇన్‌సెట్లో) లారీలో తరలిస్తున్న మర్రిచెట్టు కట్టెలు

కోనరావుపేట, డిసెంబర్ 15 : అనుమతి లేకుండానే అక్రమార్కులు చెట్లను నరికివేస్తూ వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. యథేచ్ఛగా భారీ వృక్షాలను నరికివేస్తూ గుట్టుచప్పుడు కాకుండా కలపను పట్టణాలకు తరలిస్తున్నారరు. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నదని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవచూపి చెట్లను నరకకుండా చూడాలని వన ప్రేమికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

మొక్కల పెంపకానికి కోట్లు ఖర్చు

ఓవైపు ప్రభుత్వాలు కోట్లు ఖర్చు పెట్టి మొక్కలు నాటిస్తుంటే మరోవైపు అక్రమార్కులు మొక్కలు నరికి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా వ్యవసాయ భూములు, రోడ్ల వెంట నాటిన చెట్లు, ప్రభుత్వ భూముల్లో పెరిగిన తుమ్మ, వేప, చింత, టేకు వంటి చెట్లను నరికి వేస్తూ ట్రాక్టర్లలో తరలిస్తూ లక్షల రూపాయలు గడిస్తున్నారు. అక్రమంగా కలప వ్యాపారం చేస్తున్న ప్రైవేటు వ్యాపారులు, సామిల్లర్లను నియంత్రించాలని వన ప్రేమికులు అటవీశాఖ అధికారులను కోరుతున్నారు.

క్షణాల్లో వృక్షాలు నేలమట్టం

మండలంలో కొన్ని నెలలుగా సిరిసిల్ల, వేములవాడ పట్టణాలకు చెందిన ప్రైవేటు వ్యాపారులు భారీ వృక్షాలే లక్ష్యంగా కలప దందా సాగిస్తున్నారు. వృక్షాలను యంత్రాల సహాయంతో నేలమట్టం చేసి వాటిని లేబర్ల ద్వారా క్షణాల్లో ట్రాక్టర్లను లోడ్ చేస్తున్నారు. వెనువెంటనే వ్యాపారి ముందు ద్విచక్ర వాహనంపై వెళుతూ వెనుకాలనే ట్రాక్టర్ లోడ్‌ను పట్టణాల్లోని సామిల్లులకు తరలిస్తున్నారు. ప్రధానంగా మండలంలోని వట్టిమల్ల, బావుసాయిపేట, మామిడిపల్లి గ్రామాల్లో వృక్షాలను నరికేస్తూ ఓ ప్రైవేటు వ్యాపారి రాత్రి వేళలో తరలిస్తున్నాడు. ఇదంతా జరిగిన అటవీ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

అనుమతి లేకుండా నరికితే చర్యలు

గ్రామాలలో అనుమతి లేకుండా చెట్లను నరికివేయరాదు. రైతులు తమ స్వంత భూముల్లో ఉన్న భారీ వృక్షాలు నరికేయడానికి అనుమతి తీసుకోవాలి. అనుమతి లేకుండా చెట్లను నరికి అమ్ముకుంటే వారిని గుర్తించి తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు వ్యాపారులు చెట్లను నరికితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

-అన్వర్, ఎఫ్ఎస్‌వో, వట్టిమల్ల

స్థానికులను పస్తులుంచుతున్న కాంట్రాక్టర్లు

- భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గీస భిక్షపతి

మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గీస భిక్షపతి

కలెక్టరేట్, డిసెంబర్ 15: పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఇతర రాష్ట్రాల కార్మికులకు పనికల్పిస్తూ, స్థానిక కార్మికులకు పని లేకుండా భవన నిర్మాణ కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్నారని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గీస భిక్షపతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం సిరిసిల్ల లేబర్ అడ్డా వద్ద భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ, లేబర్ అడ్డా మీద ఆధారపడి పని చేస్తున్న కార్మికులకు పని దొరక్క తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టర్లు స్థానిక కార్మికుల కడుపులు కొడుతూ వారికి పని లేకుండా చేస్తున్నారని, ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ కూలికి కార్మికులను తీసుకువచ్చి పని చేయిస్తున్నారన్నారు. కాంట్రాక్టర్లు వలస కార్మికులను తీసుకువచ్చి పని చేయడం వల్ల ఇక్కడి కార్మికులకు పని దొరకని పరిస్థితి నెలకొందన్నారు. లేబర్ అధికారులు వలస చట్టం ప్రకారం, వలస కార్మికులను తీసుకువచ్చి పని చేస్తున్న కార్మికులపై చర్యలు తీసుకోకపోవడంతో ఇక్కడి కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. తెలంగాణలోనే ఇక్కడి కార్మికులకు ఉపాధి దొరక్క పస్తులుండే పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్థానికులకు పని కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడ ఎగమంటి ఎల్లారెడ్డి, మూశం రమేశ్, కోడం రమణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకుడు మిట్టపల్లి రాజమల్లు, ఎలిగేటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక : సీఐటీయూ సిరిసిల్ల భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లింగంపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా పోకల దేవయ్య, ప్రధాన కార్యదర్శిగా కోల శ్రీనివాస్, పసుల దేవరాజ్, నవీన్, సూరం దుర్గవ్వ, కాయతి హనుమవ్వ, మల్యాల రాజమణిని ఎన్నుకున్నారు.

ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుల హవా

- భార్య పక్కనే అధికారిక హోదాలో స్టేజీపై భర్తకు సీటు

గురుకుల పాఠశాల అధికారిక సమావేశంలో స్టేజీపై కూర్చున్న ఏఎంసీ చైర్మన్ చైతన్య రెడ్డి, పక్కన ఆమె భర్త కాంగ్రెస్ నాయకుడు ఐరెడ్డి మహేందర్ రెడ్డి

ఇల్లంతకుంట, డిసెంబర్ 15 : మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన అధికారిక సమావేశానికి అధ్యక్షత వహించిన ఏఎంసీ చైర్‌పర్సన్ ఐరెడ్డి చైతన్య రెడ్డి పక్కనే ఆమె భర్త కాంగ్రెస్ నాయకుడు ఐరెడ్డి మహేందర్ రెడ్డి కూర్చోవడం చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని శనివారం హడావిడిగా ప్రారంభించింది. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల పరిశీలనకు ప్రభుత్వం తహసీల్దార్‌తోపాటు ఏఎంసీ చైర్మన్లను అధికారికంగా కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని ప్రారంభించి సమావేశాలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు పదవులు ఇచ్చినా వారి భర్తలే పెత్తనం చలాయిస్తూ అధికార సమావేశాల్లో పాల్గొనడం, ఈ కార్యకమాలకు అధికారులు సైతం స్టేజీపై వారి పక్కన కుర్చీని వేసి సమావేశం నిర్వహించడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో కాంగ్రెస్ నేతల ప్రమేయం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

బైక్ అదుపుతప్పి.. పొలంలో పడి యువకుడి దుర్మరణం

కోనరావుపేట, డిసెంబర్ 15: బైక్ అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లడంతో తీవ్రగాయాలై యువకుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి, కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామానికి చెందిన బెజగం అనిల్(35) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం ఉదయం అనిల్ తన భార్య, పిల్లలను అత్తవారింట్లో దింపి వచ్చాడు. అదేరోజు రాత్రి అత్తగారింటికి బైక్‌పై బయలుదేరాడు. రాత్రివేళ నిజామాబాద్ శివారులోని ఎల్లమ్మ ఆలయ సమీపం లో మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పడంతో పొలంలోని బురదలో పడిపోయాడు. ఆదివారం ఉదయం రైతు పొలం దున్నుతుండగా, బైక్‌తో పాటు అనిల్ విగత జీవిగా కనిపించాడు. అతడి సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. అనిల్‌కు భార్య పూజ, కుమారుడు మదన్, తల్లి దేవవ్వ ఉన్నారు. అనిల్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 15: సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఆర్. శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ జి. శ్రీనివాస్, కే. లక్ష్మణ రావు, వెంకటస్వామి, తెలంగాణ బహుజన టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్ రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులకు వారు సంఘీభావం తెలిపారు. తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కాగా, కరీంనగర్ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఉద్యోగులు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లాప్రధాన కార్యదర్శి మహేశ్, జిల్లా ఉపాధ్యక్షులు రమేశ్, రవిచంద్ర, బి. శ్రీకాంత్, కేజీబీవీ ప్రత్యేకాధికారులు ఎం. అజిత, బి. రమాదేవి, ఎన్. పూర్ణిమ గౌతమి, పి.మాధవి, పి. కిరణ్ జ్యోతి, ఎం. స్వప్న, ఎ. సునీత, పి.కవిత, వై.భార్గవి, ఇ.లావణ్య, కే. సుప్రియ, కె.రజిత, జి. పుష్కరాణి, కె. మధులత, ఉపాధ్యక్షులు వరలక్ష్మి, నీరజ, రవిచందర్, ఆంజనేయులు, వెంకటేశ్, శ్రీకన్య, బి. రమేశ్, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల ద్వారానే మాదిగల అభివృద్ధి

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 15: రిజర్వేషన్ల ద్వారానే మాదిగల అభివృద్ధి సాధ్యమవుతుందని మాదిగల ఐక్య వేదిక నాయకులు అన్నారు. 'ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ.. మాదిగల సమగ్ర అభివృద్ధి కోసం మాదిగల తక్షణ కర్తవ్యం' అంశంపై ఆదివారం పట్టణంలోని మధువని గార్డెన్స్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాదిగల ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ.. రిజర్వేషన్ల విషయంలో అత్యధిక శాతంలో ఉన్న మాదిగలు పూర్తిగా నష్టపోతున్నారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై మాలలు వైఖరి మార్చుకోకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో మాదిగలను ఓట్లు అడగకూడదని, మాదిగలు ఏ పార్టీలో ఉన్నా పార్టీలకు అతీతంగా గెలిపించాలని తీర్మానాలు చేసినట్టు వారు తెలిపారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ అట్రాసిటీస్ రాష్ట్ర ఇన్‌చార్జి తిప్పారపు సంపత్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రుద్రారపు రాంచందర్, మారపెల్లి శ్రీనివాస్, ఆకినపెల్లి శిరీష, మిడిదొడ్డి శ్రీనివాస్, కొండ్ర నరేశ్, మొలుగూరి పూర్ణచందర్, పర్లపెల్లి రమేశ్, మిడిదొడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని ఓ పరీక్షా కేంద్రంలో పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

- ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అనుమతించని అధికారులు
- 50.98 శాతానికి మించని హాజరు
- 7,163 మంది అభ్యర్థులు
- 3,652 మంది హాజరు
- 3,511 గైర్హాజరు
- సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష పకడ్బందీ ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా జరిగింది. ఉదయం పేపర్-1, మధ్యాహ్నం పేపర్-2 జరుగగా, అభ్యర్థుల హాజరు శాతం 50.98 శాతం మించలేదు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో కలిపి మొత్తం 26పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. అక్కడక్కడా పలువురు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో అధికారులు లోనికి అనుమతించలేదు. కొద్దిసేపు వేచి ఉన్న అభ్యర్థులు చేసేదేమీ లేక వెనుదిరిగి ఇళ్లకు వెళ్లిపోయారు. ఉదయం 7,163 మంది అభ్యర్థులకు 3,652 మంది హాజరయ్యారు. 3,511 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం రెండోపరీక్షకు 3,549 మంది హాజరయ్యారు. 39 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో ఏస్పీ చంద్రయ్య, డీఎస్పీ, సీఐలు పరీక్షా కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్ భీమ్యానాయక్, అధికారులు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది.

వేములవాడ రూరల్, డిసెంబర్ 15 : వేములవాడ మండలం అగ్రహారం పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలో జరిగిన గ్రూప్ 2 పరీక్షలు ప్రశాంతగా ముగిశాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు సమయాల్లో పరీక్షలు జరగగా ఇద్దరు విద్యార్థులు సమయానికి హాజరు కాకపోవడంతో వెనుదిరిగారు. అందులో ఓ యువతి సమయం దాటి పోవడంతో కేంద్రం వద్ద బోరున విలపించింది. రెండు కేంద్రాలను ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించారు.

అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలో గ్రూప్ 2కు సమయం దాటి పోవడంతో బోరున విలపిస్తున్న విద్యార్థిని

బ్రాహ్మణ పరిషత్‌కు నిధులు విడుదల చేయాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర మహిళా కార్యదర్శి సంకేపల్లి సుమలత



విలేకరులతో మాట్లాడుతున్న సంకేపల్లి సుమలత

వేములవాడ టౌన్, డిసెంబర్ 15 : బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రూ.50 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర మహిళా కార్యదర్శి సంకేపల్లి సుమలత అన్నారు. ఆదివారం వారు వేములవాడ రాజన్నను దర్శించుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలోని బ్రాహ్మణుల అభ్యున్నతికి ఆర్థిక మద్దతు ప్రకటించి వెంటనే నిధులు విడుదల చేయాలన్నారు. విదేశాల్లో చదువుకునే పేద బ్రాహ్మణులకు ఆర్థిక సహాయం చేయాలని, బ్రాహ్మణులను పారిశ్రామికంగా ప్రోత్సహించి, వారికి తగిన ఆర్థిక సహాయం అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సంకేపల్లి సుధాకర్‌శర్మతో పాటు నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉచిత వైద్య శిబిరం

రుద్రంగి, డిసెంబర్ 15: మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి సీఎస్సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఆదివారం కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది మాట్లాడుతూ, ఈ వైద్య శిబిరంలో భవన నిర్మాణ కార్మికుల కొరకు 19 రకాల టెస్టులు చేసి 50 రకాల ఫలితాలు పొందుతామన్నారు. కార్మికుల బరువు, ఎత్తు, బీపీ, షుగర్, కంటి, దీర్ఘకాలిక నొప్పులు, అల్సర్, థైరాయిడ్, క్యాన్సర్, లివర్ ఫంక్షన్, గుండెకు సంబంధించి ఈసీజీ, రక్త పరీక్షలు, యూరిన్ టెస్టు వంటి పరీక్షలు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకొని ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రుద్రంగిలో కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కేసీఆర్ హయాంలోనే కురుమ భవన్

- 2017లోనే కోకాపేటలో ఐదెకరాల స్థలం
- రూ.5 కోట్లతో అన్ని హంగులతో భవనం
- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య

చందుర్తి, డిసెంబర్ 15: పోరాడి సాధించుకున్న తెలంగాణలో సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి గౌరవ కేసీఆర్ కులవృత్తులకు వేలకోట్లు వెచ్చించి ఆర్థికాభ్యున్నతికి బాటలు వేశారని బీఆర్ఎస్ చందుర్తి మండలాధ్యక్షుడు, కురుమ సంఘం నాయకులు ఎల్లయ్య అన్నారు. రంగారెడ్డి జిల్లా దుండిగల్ మండలం కోకాపేటలో శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించిన దొడ్డి కొమురయ్య కురుమ ఆత్మ గౌరవ భవన్ సకలహంగులతో నిర్మించిన ఘనత కేసీఆర్ గారికే దక్కుతుందన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, దేశంలోనే అత్యంత ఖరీదైన కోకాపేటలో కురుమ ఆత్మగౌరవ భవన నిర్మాణానికి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 2017లో ఐదెకరాల స్థలంతోపాటు రూ.5 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేవలం ప్రహరీ గోడ మాత్రమే పూర్తయిందని దీన్ని తమ ఘనతగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. సుమారు రూ.500 కోట్ల విలువైన స్థలాన్ని భవన నిర్మాణానికి కేటాయించినప్పటికీ సభలో కేసీఆర్ గారి పేరు ప్రస్తావించకపోవడం రాష్ట్ర కురుమ కులస్తులందరినీ విస్మయ పరిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎమ్మెల్సీగా కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడె ఎగ్గె మల్లేశంకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా తుల ఉమ గారితోపాటు కొమరవెల్లి దేవస్థానం చైర్మన్‌గా చేవెళ్ల సంపత్ గారికి అవకాశం కల్పించి కురుమల ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి కేసీఆర్ బాటలు వేశారని కొనియాడారు.